సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం । 12 । ఆగస్టు । 2025



ఆర్టీసీ 'స్పెషల్' బాదుడు

రాఖీ పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా స్పెషల్ సర్వీసుల పేరిట ఆర్టీసీ టికెట్‌పై 30 శాతం చార్జీలు పెంచారు.

-8లో ▸



కృష్ణ, తుంగభద్రలకు భారీ వరద

ఎగువన కురుస్తున్న వర్షాలతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో పారుతున్న కృష్ణా, తుంగభద్ర నదులకు భారీ వరద వస్తోంది.

-8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.1 /21.1

వాతావరణం

ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వచ్చేనెల 3న సీఎం రేవంత్‌రెడ్డి రాక



అడ్డాకుల: వచ్చే నెల 3న మూసాపేటకు సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారు. మూసాపేటలో నిర్మాణాలు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలకు హాజరు కానున్నారు. ఇందులో భాగంగా సోమవారం దేవరకద్రలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మూసాపేట గ్రామస్తులతో సమావేశమయ్యారు. మూసాపేటలో చివరి దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. వచ్చేనెల ప్రారంభం నాటికి ఇళ్ల పనులను పూర్తి చేస్తే గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి వాటిని ప్రారంభిస్తారని ఎమ్మెల్యే గ్రామస్తులకు తెలిపారు. అలాగే మూసాపేటలో ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనంలో కొనసాగుతున్నందున వాటికి కొత్త భవనాలు, మండల కాంప్లెక్స్ నిర్మాణం పనులకు సీఎం శంకుస్థాపన చేసే అవకాశం ఉంది. అలాగే వేముల శివారులోని ఎస్‌జీడీ ఫార్మా పరిశ్రమ రెండో యూనిట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, నాయకులు మశ్చందర్‌నాథ్, శ్రీనివాస్‌శర్మ, నారాయణ, విజయ్‌కుమార్, కలీం, జమీర్, సత్యనారాయణ, పాష, సలాం, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి: ఎస్పీ



మహబూబ్‌నగర్ క్రైం: పోలీసులు ఎప్పుడూ పౌరుల సమస్యలను సావధానంగా విని, మర్యాదపూర్వకంగా స్పందించాలని ఎస్పీ డి.జానకి అన్నారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 13 మంది బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. బాధితులు ఒక్కొక్కరితో మాట్లాడుతూ వారి సమస్య తెలుసుకుని ఆయా పోలీస్ అధికారులతో మాట్లాడి వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పరిష్కార స్థితిని క్రమం తప్పకుండా సమీక్షించాలన్నారు. బాధితుల సమస్యలను పరిష్కరించడానికి పోలీస్ యంత్రాంగం 24 గంటలు పని చేస్తోందని పేర్కొన్నారు.

యూరియా అందుబాటులో ఉంచాలి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వానాకాలం సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన గేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేత కాని తనం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రైతులు నారుమళ్లు పోసుకుని నాట్లు వేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ, పురుగు మందు, కాంప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

భూములు కోల్పోయి.. మోసపోయి..
గుండె పగిలిపోయి..



చనిపోయిన తన భర్త పస్పుల శేఖర్ ఫొటోను చూపిస్తున్న మహిళ పేరు పార్వతమ్మ. వనపర్తి జిల్లా రేవల్లి మండలం బండరాయిపాకుల గ్రామానికి చెందిన ఆ దంపతులకు ముగ్గురు సంతానం. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో భాగమైన ఏదుల రిజర్వాయర్ నిర్మాణంలో వీరికి ఉన్న ఎకరం భూమి ముంపునకు గురైంది. ఎకరాకు రూ.3.50 లక్షల చొప్పున ప్రభుత్వం పరిహారం అందించింది. రూ.2 చొప్పున వడ్డీ ఇస్తామని నమ్మబలకడంతో శేఖర్ రూ.2 లక్షలను ఓం శ్రీసాయిరాం ఫైనాన్స్ కంపెనీలో జమచేశాడు. ఆరునెలల్లో డబ్బులు తిరిగిస్తామని పత్రం రాసివ్వగా, మూడేళ్లు గడిచినా డబ్బులు ఇవ్వలేదు. పైసలు రావడం లేదన్న బెంగతో 2023 ఆగస్టు 26న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పునరావాసం కింద నిర్మించుకుంటున్న ఇల్లు సైతం డబ్బులు లేక అసంపూర్తిగానే ఉండగా.. పిల్లలను ఎలా పోషించాలో తెలియడం లేదని భార్య పార్వతమ్మ వాపోతోంది.

ఒక్కొక్కరుగా 'పాలమూరు–రంగారెడ్డి' నిర్వాసితుల మృత్యువాత

- వడ్డీ ఆశతో వచ్చిన పరిహారం డబ్బులు ఓం శ్రీసాయిరాం ఫైనాన్స్‌లో జమ
- వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో సుమారు 2,500 మంది బాధితులు
- రూ.180 కోట్ల మేర కంపెనీలో డిపాజిట్.. బోర్డు తిప్పేయడంతో రైతుల గగ్గోలు
- మోసంతో చితికిన కుటుంబాలు.. అనారోగ్యంతో మంచం పాలు
- ఇప్పటికే ఒకరు ఆత్మహత్య.. హార్ట్ ఎటాక్‌తో 20 మంది వరకు మృతి
- వివిధ ఆరోగ్య కారణాలతో మరో 120 మంది కూడా..



ఫైనాన్స్ కంపెనీ చేతిలో మోసపోయిన వనపర్తి జిల్లా రేవల్లి మండలం బండరాయిపాకుల బాధితులు

గ్రాండ్ రిపోర్ట్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/సాక్షి, నాగర్‌కర్నూల్: ఆరుగాలం కష్టించి జీవనోపాధి పొందుతున్న వ్యవసాయ భూములతో పాటు ఉంటున్న ఇళ్లు, జ్ఞాపకాలన్నీ పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ నిర్మాణంలో పోయాయి. ఆ తర్వాత వచ్చిన అరకొర పరిహారంతోనైనా కుటుంబ పరిస్థితులు చక్కదిద్దుకోవాలన్న వారి ఆశలను బోగస్ ఫైనాన్స్ కంపెనీ గండి కొట్టింది. అధిక వడ్డీ చెల్లిస్తామనే పేరిట నిర్వాసితుల నుంచి భారీగా డబ్బులు సేకరించి.. చివరకు బోర్డు తిప్పేసింది. ఈ క్రమంలో రైతులు అంతకుముందు నుంచే అంటే నాలుగేళ్లుగా వారి చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఫలితం లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురై అనారోగ్యం పాలవుతున్నారు. బాధితుల్లో ఇప్పటివరకు పలువురు ఆత్మహత్య చేసుకోగా.. హార్ట్ అటాక్‌తో సుమారు 20 మంది.. కిడ్నీ ఇతర ఆరోగ్య కారణాలతో మరో 120 మంది వరకు మృత్యు కౌగిలికి చేరారు. ఇంకా కొందరు చికిత్సకు డబ్బులు లేక మరణశయ్యపై కొట్టుమిట్టాడుతున్న నేపథ్యంలో 'సాక్షి' గ్రాండ్ రిపోర్ట్..

14 మందిపై కేసు.. రూ.50 కోట్ల ఆస్తి జప్తు

డిపాజిట్ల అనంతరం కొన్ని రోజుల తర్వాత ఫైనాన్స్ నిర్వాహకులు సక్రమంగా వడ్డీ చెల్లించకపోవడంతో నిర్వాసితులు నాగర్‌కర్నూల్ మార్కెట్ సెంటర్‌లోని ఫైనాన్స్ కార్యాలయం వద్దకు క్యూ కట్టారు. ఇలా 2020 నుంచి 2023 వరకు చక్కర్లు కొట్టారు. అప్పుడు, ఇప్పుడు అంటూ ఫైనాన్స్ నిర్వాహకుడు సాయిబాబు, అతడి కుటుంబ సభ్యులు మాయమాటలు చెబుతూ చివరకు కంపెనీని ఎత్తివేశారు. దీంతో 2023 ఫిబ్రవరి 13న బాధితులు నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదైంది. ఇందులో ఇత్యాల సాయిబాబు (ఏ–1)తో పాటు ధనుంజయ్ (ఏ–2), బాలేశ్వర్ (ఏ–3), ఇత్యాల రజిత (ఏ–4), యామిని (ఏ–5), శారద (ఏ–6), సాయి దివ్య (ఏ–7), సాయి దీక్షిత్ (ఏ–8) అనుపటి శ్రీనివాసులు, తాడూరు మాజీ సర్పంచ్(ఏ–9), ఆర్‌అండ్‌ఆర్ కమిటీ చైర్మన్‌గా ఉన్న నాగం బుచ్చిరెడ్డి అలియాస్ సురేందర్‌రెడ్డి (ఏ–10), జానకీ రాంరెడ్డి (ఏ–11), కరుణాకర్‌రెడ్డి (ఏ–12), గువ్వ వెంకటేశ్వర్లు (ఏ–13), ఉర్సు హుస్సేన్ (ఏ–14)పై కేసు నమోదైంది. వీరిలో సాయిబాబు, సాయిదీక్షిత్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, హుస్సేన్‌ను అరెస్ట్ చేశారు. మిగిలిన వారు ముందస్తు బెయిల్ పొందారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం సాయిబాబు కుటుంబసభ్యుల ఆస్తులను జప్తు చేయాలని.. ఈ ఏడాది జూన్ 17న జీఓ నంబర్ 562ను విడుదల చేసింది. ఈ మేరకు తెలంగాణ మార్కెట్ వాల్యు ప్రకారం ఇప్పటివరకు సదరు ఫైనాన్స్ కంపెనీ నిర్వాహకులకు సంబంధించి రూ.50 కోట్ల ఆస్తిని జప్తు చేశారు.

చికిత్సకు డబ్బులు లేక అమ్మ చనిపోయింది..



మా తల్లిదండ్రుల పేరిట ఉన్న 8 ఎకరాలు మొత్తం ప్రాజెక్ట్‌లోనే పోయింది. పరిహారం కింద వచ్చిన డబ్బులను మా తల్లిదండ్రుల పేరిట రూ.10 లక్షలు, నా పేరిట మరో రూ.2 లక్షలు ఫైనాన్స్ కంపెనీలో జమచేశాం. 2019లో డబ్బులు జమచేస్తే నాలుగేళ్లయినా తిరిగి ఇవ్వలేదు. మా అమ్మ లక్ష్మమ్మకు పక్షవాతం వస్తే, చికిత్స చేయించేందుకు కూడా డబ్బులు లేకపోవడంతో ఏడాది కిందట చనిపోయింది. జీవనాధారమైన భూములు కోల్పోయి, డబ్బులు పోగొట్టుకుని అరిగోస పడుతున్నాం.

– అలివేలు, బండరాయిపాకుల, రేవల్లి, వనపర్తి

2 వేల మంది.. సుమారు రూ.180 కోట్ల డిపాజిట్

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ముంపునకు గురవుతున్న ప్రజలకు సంబంధించి గత ప్రభుత్వం పరిహారం అందజేసింది. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో సుమారు 50 గ్రామాలు ముంపునకు గురికాగా.. నిర్వాసితులకు సంబంధించి ఎకరా పట్టా భూమికి రూ.5.50 లక్షలు, లావణి పట్టా భూమికి రూ.3.50 లక్షలు.. ఇల్లు కోల్పోయిన వారికి ఒక్కొక్కరికి రూ.12.50లక్షల చొప్పున ప్రభుత్వం పరిహారం పంపిణీ చేసింది. అయితే ముంపు గ్రామమైన వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని నాగపూర్‌కు చెందిన సాయిబాబా తన కుటుంబసభ్యులతో కలిసి నాగర్‌కర్నూల్ మార్కెట్ యార్డు సమీపంలో ఓం శ్రీసాయిరాం ఫైనాన్స్ పేరుతో 1995 నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ప్రైవేట్ ఫైనాన్స్‌ను నడిపిస్తున్నాడు. మొదట రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు చిట్టీల వ్యాపారం చేసి నమ్మకం కలిగించాడు. ఈ క్రమంలో రైతులకు ఒక్కసారిగా వచ్చిన నష్ట పరిహారంపై అతడి కన్ను పడింది. రూ.2 చొప్పున వడ్డీ చెల్లిస్తామని.. మీరు భూములు, ప్లాట్లు కొన్నప్పుడు 15 రోజుల ముందు చెబితే మీ డబ్బులు మీకు ఇస్తామని నమ్మబలికి 2018 నుంచి 2020 వరకు డిపాజిట్ చేయించుకున్నాడు. తొలుత వడ్డీ సక్రమంగా చెల్లిస్తూ రాగా.. సుమారు 2,500 మంది దాదాపు రూ.150 నుంచి రూ.180 కోట్ల వరకు సదరు ఫైనాన్స్ కంపెనీలో నిర్వాసితులు పరిహారం డబ్బులను జమ చేశారు.

ఆందోళన చేపడతాం..



పరిహారం డబ్బుల కోసం ఎదురుచూస్తూ ఇప్పటికే దాదాపు 150 మంది చనిపోయారు. ఆర్‌అండ్‌ఆర్ కమిటీ చైర్మన్‌గా ఉన్న నాగం బుచ్చిరెడ్డి అలియాస్ సురేందర్‌రెడ్డి ప్రోద్బలంతోనే అందరూ ఓం శ్రీసాయిరాం ఫైనాన్స్‌లో డబ్బులు పెట్టారు. ఫైనాన్స్ నిర్వాహకుడు సాయిబాబుతో కలిసి పక్కా ప్లాన్‌తో బోర్డు తిప్పేశాడు. ఫైనాన్స్ కంపెనీ వాళ్ల కలెక్టర్ ఆఫీస్‌కు వచ్చి.. వారి ఆస్తులను గ్రామాల వారీగా బాధిత రైతుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలి. మాకు పరిహారం చెల్లించకుంటే.. పోరు కార్యాచరణ ప్రకటించి.. ఆందోళన చేపడతాం. ఆయా నిందితుల ఇంటి వద్ద వాంటావార్పు వంటి కార్యక్రమాలు చేపడతాం. మా బాధను అందరూ అర్థం చేసుకోవాలి.

– బంగారయ్య, బాధితుడు, బండరాయిపాకుల

అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నాం..



ఫైనాన్స్ కంపెనీ పేరిట బాధితులను మోసం చేసినట్టుగా గుర్తించి నిర్వాహకులపై కేసు నమోదు చేశాం. అన్ని కోణాల్లో సమగ్రంగా విచారణ చేపడుతున్నాం. ఇప్పటివరకు 1,500 వరకు బాధితులు ఉన్నట్లుగా గుర్తించాం. కేసు దర్యాప్తులో వేగం పెంచి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– వైభవ్ గైక్వాడ్, ఎస్పీ, నాగర్‌కర్నూల్

91.12 శాతం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



పాలమూరు: జిల్లా ఆరోగ్య శాఖ ఇమ్యూనైజేషన్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో 1–19 ఏళ్లలోపు బాల, బాలికలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేపట్టారు. పిల్లల్లో నులి పురుగుల నిర్మూలన కోసం ఈ మాత్రలను అందజేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 2,54,210 మంది బాల, బాలికలను గుర్తించగా మొదటిరోజు 2,31,646 మంది (91.12 శాతం)కి మాత్రలు పంపిణీ చేశారు. మిగిలిన 22,564 మందికి ఈ నెల 18 వరకు మాప్‌అప్ కింద ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు.

మంచి ఆరోగ్యం అవసరం

విద్యార్థులకు చదువుతోపాటు మంచి ఆరోగ్యం అవసరమని, ఆరోగ్యంగా ఉన్న విద్యార్థులకు చదువు చక్కగా అర్థమవుతుందని కలెక్టర్ విజయేందిర అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీ రోడ్ హైస్కూల్‌లో ఆమె విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్, జీవిత లక్ష్యం కోసం అడుగులు వేయాలని, ఉన్నత చదువులలో రాణించాలని సూచించారు. అనంతరం శివశక్తినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్ ఆవరణలో ఉన్న చెత్తాచెదారం వెంటనే తొలగించాలని ఆదేశించారు. పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఇచ్చారా లేదా అడిగి తెలుసుకున్నారు. గుడ్లను సక్రమంగా ఉడికించి ఇవ్వాలని సూచించారు. అనంతరం తెలుగుగేరిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ కృష్ణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి పద్మజా, వైద్యులు రఫీక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

■ జిల్లాలోని గంగాపూర్, అమిస్తాపూర్, హన్వాడ పీహెచ్‌సీలను డీఎంహెచ్‌ఓ తనిఖీ చేయడంతోపాటు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.



ఆధునికతకు ఆమడదూరం!

- డిజిటలైజేషన్‌కు నోచుకోని గ్రంథాలయాలు
- నేడు జాతీయ గ్రంథాలయ అధికారుల దినోత్సవం

- వివరాలు 8లో..

చిరుత సంచారంపై పరిశీలన



చిరుత ట్రాప్ సీసీ కెమెరాకు చిక్కిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లాకేంద్రం సమీపంలోని తిర్మల్‌దేవునిగుట్ట, శ్మశానవాటిక ప్రాంతాల్లో కొంతకాలంగా సంచరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్న చిరుత ఈ నెల 11న తెల్లవారుజామున ట్రాప్ కెమెరాకు చిక్కిన ప్రదేశాన్ని సోమవారం సాయంత్రం జిల్లా అటవీ శాఖాధికారి సత్యనారాయణ పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ట్రాప్ సీసీ కెమెరాకు గతంలోనూ కనిపించడంతో చిరుతను పట్టుకునే సాధ్యాసాధ్యాలపై సిబ్బందితో చర్చించి సూచనలు చేశారు. చుట్టుపక్కల మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు బోను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పరిసర ప్రాంతాల ప్రజలు చిరుత సంచారం పట్ల అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని కోరారు.

రాహుల్‌గాంధీ అరెస్టు రాజ్యాంగ విరుద్ధం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ని అరెస్టు చేయడం రాజ్యాంగ విరుద్ధమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలోని బీజేపీ వచ్చే ఎన్నికల్లో దొడ్డిదారిన గెలిచేందుకు ఎన్నో కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. ఎన్నికల కమిషన్‌ను అడ్డం పెట్టుకుని ఆ పార్టీ ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో లక్షలాది నకిలీ ఓటర్లను సృష్టించిందని ఆరోపించారు. ఇదే విషయాన్ని రాహుల్‌గాంధీ వివిధ ఆధారాలతో సహా నిరూపించడమేగాక న్యాయ పోరాటానికి సైతం సిద్ధమయ్యారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లను తొలగించి బ్యాలెట్ పేపర్ ఆధారంగానే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

జాతీయ జెండా ఆడియో పాట ఆవిష్కరణ



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రముఖ కవి, రిటైర్డ్ జీహెచ్‌ఎం దేవదానం రచించిన జాతీయ జెండా పాట సీడీని సోమవారం తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ పాటకు గన్నోజు నర్సింహాచారి సంగీతం సమకూర్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓ త్రివర్ణ పతాకమా.. నీవు ఎగురుతుంటే ఆకాశమే చిన్నబోతోందని పింగళి వెంకయ్య ఎంచుకున్న భావాలకు అనుగుణంగా ఈ పాట ఉందన్నారు. ఈ పాట అందరి మన్ననలు చూరగొని విశేష ఆదరణ పొందాలని ఆకాంక్షించారు.

కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలో కొత్త స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నూతన స్వయం సహాయక సంఘాల ఏర్పాటుపై శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళా, వృద్ధ, దివ్యాంగ, కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేసి, వీటిలో పేదవారిని చేర్పించాలన్నారు. అలాగే 60 ఏళ్లు పైబడిన వారు, దివ్యాంగులు, కిశోర బాలికలను గుర్తించి సంఘాలలో చేరేలా ప్రోత్సహించాలన్నారు. వారితో బ్యాంకు ఖాతాలు, తెరిపించాలని, ఇందులో ఏమైనా సమస్యలు ఎదురైతే ఏపీఎంల సహకారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ఈ నెలాఖరు వరకు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో సెర్ప్ అధికారి వసంతసేనా, డీఆర్‌డీఓ నర్సింహులు, ఏపీడీ శారద, డీపీఎంలు లక్ష్మయ్య, అరుణదేవి, రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 76 ఫిర్యాదులు

ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. ప్రజావాణిలో భాగంగా కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాల్‌లో ప్రజల నుంచి 76 ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, నర్సింహారెడ్డి, జెడ్పీసీఈఓ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ నవీన్, హౌజింగ్ పీడీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల రాష్ట్రంగా మార్చారు

- ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తాం
- రాష్ట్ర కార్మిక, గనులశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



అచ్చంపేట మున్సిపల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వివేక్ వెంకట్‌స్వామి. చిత్రంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్

అచ్చంపేట/బల్మూర్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి ఓవైపు ప్రజాసంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేస్తూనే, మరోవైపు అప్పులు తిరిగి చెల్లిస్తున్నారని రాష్ట్ర కార్మిక, గనులశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం అచ్చంపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యేలు డా.చిక్కుడు వంశీకృష్ణ, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. అర్హులైన పేదలకు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజా సంక్షేమం, గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వ నిర్వాకంతో ఆర్థిక సంక్షోభం నెలకొన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నట్లు చెప్పారు. మరోవైపు ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుస్తున్నామన్నారు. రాష్ట్రంలో పండించిన సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇవ్వడమే కాకుండా.. రేషన్ దుకాణాల్లో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అచ్చంపేట అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. టీయూఎఫ్‌ఐడీసీ నుంచి మరో రూ.16కోట్ల నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలకు మేలుచేసే విధంగా ప్రతి అధికారి పని చేయాలని సూచించారు.

■ బల్మూర్ మండలం కొండనాగులలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మంత్రి వివేక్ వెంకటస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. బాబా సాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ గార్లపాడు శ్రీనివాసులు, కమిషనర్ మురళి, ఆర్డీఓ మాధవి, తహసీల్దార్ సైదులు, జిల్లా గ్రంథాయాల సంస్థ చైర్మన్ జి.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి అహర్నిశలు కృషి



గాలిగోపురం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: ఆలయాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. సోమవారం బాదేపల్లి పెద్దగుట్టపై శ్రీరంగనాయకస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దగుట్టను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. అంతకు ముందు ఆలయ చైర్మన్ రాంరెడ్డి, అర్చకులు ఆయనకు పూర్ణకుంభం, మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం మండలంలోని ఆల్వాన్‌పల్లి గ్రామ సమీపంలో మీనాంబరం వద్ద శ్రీపరుశవేదీశ్వరస్వామి ఆలయ గాలిగోపురం నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఆలయాలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ప్రతి ఒక్కరు దైవచింతన కలిగి ఉండాలని, మానసిక ప్రశాంతతకు ఆలయాలు చక్కటి ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఉపయోగపడతాయన్నారు. ఆలయాల వద్ద భక్తులకు కనీస సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అభివృద్ధి కమిటీలు ఆలయాల పరిరక్షణకు కృషి చేయడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ జ్యోతి, మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, అభివృద్ధి కమిటీ చైర్మన్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ 'స్పెషల్' బాదుడు

- ఈ నెల 9 నుంచి 11 వరకు అదనపు సర్వీసులపై చార్జీల పెంపు
- ఒక్కో బస్సులో ఒక్కోరకంగా వసూలు
- పెంచిన చార్జీలతో ప్రయాణికుల ఆవేదన

స్టేషన్ మహబూబ్‌నగర్: రాఖీ పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆర్టీసీ సంస్థ ప్రత్యేక అదనపు బస్సు సర్వీసులను నడిపింది. ఇదే అదునుగా అదనపు బస్సు సర్వీసుల టికెట్‌పై దాదాపు 30 శాతం చార్జీలు పెంచారు. అయితే చాలామంది ప్రయాణికులకు పెంచిన ధరలు తెలియకపోవడంతో బస్సు ఎక్కిన తర్వాత తీరా టికెట్ తీసుకునే సమయంలో కంగుతింటున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి 11 వరకు ప్రత్యేక బస్సు సర్వీసుల్లో అదనపు చార్జీలు వసూలు చేశారు. దీనికితోడు ఒక్కో బస్సులో ఒక్కో రకంగా చార్జీలు తీసుకోవడం గమనార్హం.

అదనపు చార్జీలు ఇలా..
మహబూబ్‌నగర్ టు హైదరాబాద్‌కు సంబంధించి ఎక్స్‌ప్రెస్‌లో గతంలో రూ.160 ఉండగా ఈ మూడు రోజుల్లో రూ.220, డీలక్స్ బస్సులో రూ.190 ఉంటే రూ.250 వరకు తీసుకున్నారు. ఇలా ప్రతి డిపో పరిధిలో రాఖీ పండుగ వేళ నడిపిన ప్రత్యేక అదనపు బస్సు సర్వీసుల్లో అదనపు చార్జీలు తీసుకున్నారు. అయితే భారీ మొత్తంలో అదనపు చార్జీలు తీసుకోవడంపై ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ప్రతి పండుగకు ప్రత్యేక బస్సులు నడిపి అదనపు చార్జీలు తీసుకుంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

బస్టాండ్లలో పెరిగిన రద్దీ
రెండు రోజుల నుంచి ఆర్టీసీ బస్టాండ్లలో విపరీతమైన రద్దీ పెరుగుతుంది. ముఖ్యంగా హైదరాబాద్ రూట్‌లోని బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసి రాకపోకలు సాగిస్తున్నాయి. బస్సులు ప్లాట్‌ఫాం వద్దకు రాకముందే ప్రయాణికులు ఎగబడి ఎక్కుతున్నారు.


మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

అదనపు చార్జీలు సరికాదు


రాఖీ పండుగ అయిపోయిన తర్వాత కూడా అదనపు చార్జీలు తీసుకోవడం సరికాదు. మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్లడానికి డీలక్స్ బస్సులో గతంలో రూ.190 ఉంటే రూ.250 టికెట్ తీసుకోవడం ఎంతవరకు సమంజసం. చార్జీలు పెంచడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చార్జీలు పెంచకూడదని నా విజ్ఞప్తి.
– శేఖర్‌రెడ్డి, మహబూబ్‌నగర్

ఇప్పటికే పాస్ ధరలు పెంచారు


నేను డిగ్రీ చదువుతున్నా. ఇప్పటికే స్టూడెంట్ పాస్‌కు సంబంధించి ధరలు పెంచారు. ఇప్పుడు ప్రత్యేక బస్సుల్లో చార్జీలు పెంచడం బాధాకరం. మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లడానికి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో గతం కంటే ఎక్కువ పెంచారు. ఆదాయం కోసం ఇలా ప్రయాణికులపై అదనపు భారం వేయడం సరికాదు.
– శ్రీనునాయక్, పెద్దతండా, కోయిలకొండ మండలం

ట్రాఫిక్ నియంత్రణ కోసమే..

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం స్పెషల్ ఆపరేషన్స్ ఉన్నప్పుడు వన్ సైడ్ ట్రాఫిక్ ఉంటుంది. అందువల్ల కొంచెం చార్జీలు పెంచుకోవడానికి అనుమతి ఇచ్చింది. దానికనుగుణంగా దసరా, సంక్రాంతి, రాఖీ పండుగ రోజుల్లో స్పెషల్ ఆపరేషన్స్‌లో వన్‌సైడ్ ట్రాఫిక్‌ను నియంత్రించడం కోసం ప్రత్యేక బస్సుల వరకు అదనంగా 30 శాతం పెంచుకునే అవకాశం ఉంటుంది. రాష్ట్రంలోని 97 ఆర్టీసీ డిపోల్లో ఇదే పద్ధతిని అవలంబిస్తున్నాం. ఈ నెల 9 నుంచి 11 వరకు మాత్రమే అదనపు చార్జీలు ఉంటాయి.
– సంతోష్‌కుమార్, ఆర్ఎం, మహబూబ్‌నగర్

జడ్చర్ల- మహబూబ్‌నగర్ మధ్య రూ.10 తేడా

జడ్చర్ల: జడ్చర్ల– మహబూబ్‌నగర్ మధ్య ఆర్టీసీ అధికారులు ఒక్కో బస్సుకు ఒక్కో చార్జీ వసూలు చేయడంతో ప్రయాణికులు అవాక్కయ్యారు. సోమవారం జడ్చర్లకు చెందిన పాల వ్యాపారి జైపాల్‌రెడ్డి మహబూబ్‌నగర్ వెళ్లేందుకు జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో ఫరూఖ్‌నగర్ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కడంతో కండక్టర్ రూ.40 తీసుకుని టికెట్ ఇచ్చాడు. తిరిగి జడ్చర్లకు వచ్చేందుకు మహబూబ్‌నగర్ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కగా.. కండక్టర్ రూ.50గా చార్జీ వసూలు చేసి టికెట్ చేతిలో పెట్టాడు. దీంతో తాను రాకపోకలు సాగించే కొన్ని గంటల వ్యవధిలోనే ఏకంగా రూ.10 అదనంగా వసూలు చేయడంతో ఒక్కసారిగా బిత్తరపోయాడు. రూ.40 మాత్రమే చార్జీ ఉండగా రూ.50 వసూలు చేయడం ఏమిటని తన దగ్గర ఉన్న టికెట్‌ను చూపించినా సదరు కండక్టర్ అంగీకరించలేదు. ఇష్టం ఉంటే రా.. లేదంటే బస్సు దిగు అని చెప్పడంతో గత్యంతరం లేక అదే బస్సులో జడ్చర్లకు వచ్చి ఈ విషయాన్ని 'సాక్షి' దృష్టికి తీసుకువచ్చాడు. అయితే శని, ఆది, సోమవారాల్లో కొన్ని ప్రత్యేక బస్సులలో రూ.10 అదనంగా చార్జీ వసూలు చేశామని ఆర్టీసీ సిబ్బంది తెలిపారు.



జడ్చర్ల- మహబూబ్‌నగర్ మధ్య తేడా ఉన్న టికెట్ ధరలు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఏఈ దుర్మరణం


శివరాజు(ఫైల్)

ఊట్కూర్: నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని బిజ్వార్‌కి చెందిన విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఏఈ శివరాజ్ (26) తెలంగాణ సరిహద్దు గ్రామం పులిచింతల వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. కుటుంబసభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా.. ఉదయం కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలోని తన ఇంటి నుంచి ద్విచక్ర వాహనం పై వెళ్తుండగా విధులు ర్వహించేందుకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అంబులెన్స్ సహాయంతో జగ్గయ్యపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విజయవాడలోని మెట్రో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు.

ఉద్యోగంలో చేరిన 7 నెలలకే..
గత 7 నెలల క్రితం సూర్యపేట జిల్లా పులిచింతల జల విద్యుత్ కేంద్రంలో ఏఈగా విధుల్లో చేరాడు. బిజ్వార్ గ్రామంలోని దళితవాడకు చెందిన బాబు, వెంకటమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. తండ్రి బాబు పిల్లలు చిన్నతనంలోనె గుండె పోటుతో మృతిచెందాడు. తల్లి వెంకటయ్య, అన్నయ్య వెంకటేశ్ తమ్ముడు శివరాజ్‌కు చదువుపై ఉన్న ఆసక్తిని గమనించి ప్రోత్సహించారు. 10వ తరగతి వరకు బిజ్వార్ ప్రభుత్వ పాఠశాలలో చదివి, మహబూబ్‌నగర్ పాలిటెక్నిక్ కళాశాలలో ట్రిబుల్ ఈ పూర్తి చేశాడు. అనంతరం హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో బిటెక్ పూర్తి చేశారు. టీఎస్‌పీఎస్‌సీ నిర్వహించిన ఉద్యోగ పరీక్షల్లో విద్యుత్ ఏఈగా పులిచింతల ప్రాజెక్టులో విధుల్లో చేరాడు. బతుకు తెరువు కోసం వెళ్లిన శివరాజ్ ఉద్యోగంలో చేరిన 7 నెలలకే మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం

దోమలపెంట: శ్రీశైలం ఆనకట్ట దిగువన ఎడమ పాతాళగంగ స్నానాల ఘట్టం సమీపంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఈగలపెంట ఎస్ఐ జయన్న సోమవారం తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. కృష్ణానదిలో వ్యక్తి మృతదేహం తేలియాడుతుండడం గమనించిన మత్స్యకారులు పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. మృతదేహం కుళ్లిపోవడంతో పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. ఒంటి మీద ఫుల్ డ్రాయర్ తప్ప మరేమి లేవన్నారు. ఎటువంటి వివరాలు తెలియరాలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాగులో కొట్టుకుపోయి వలస కూలీ మృతి

తెలకపల్లి: వాగులో కొట్టుకుపోయి వలస కూలీ మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం బలియా జిల్లాకు చెందిన బి నర్సు (66) నెల్లికుదురు సమీపంలో క్రషర్ వద్ద వలసకూలీగా పని చేస్తున్నాడు. గట్టునెల్లికుదురు గ్రామానికి వెళ్లి నిత్యావసర సరుకులు తీసుకొని తిరిగి క్రషర్ వద్దకు వస్తున్నాడు. ఈ క్రమంలో గట్టురాయిపాకుల–నెల్లికుదురు గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వాగు దాటుతుండగా ప్రమాద వశాత్తు వాగులో కొట్టుకుపోయాడు. సోమవారం ఉదయం ఒడ్డుకు చేరుకున్న బి నర్సు మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతని సహచరుడు మనోజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వృద్ధుడి మృతి

పాన్‌గల్: చేపల వేటకు వెళ్లిన ఓ వృద్ధుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం.. కేతేపల్లి గ్రామానికి చెందిన చికిరాల బిచ్చయ్య(62) కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం చేపల వేట కోసం గ్రామ శివారులోని చిన్నపులికుంటకు వెళ్లి చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. ఈ విషయం ఎవరూ గుర్తించకపోవడంతో సోమవారం ఉదయం కుంటలో మృతదేహం తేలియాడగా గ్రామస్తులు గమనించి నీటిలో నుంచి మృతదేహాన్ని బయటికి తీసి చికిరాల బిచ్చయ్యగా గుర్తించారు. ఈ విషయమై బిచ్చయ్య చిన్నమ్మ కుమారుడు గడమాల బాలస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మల్దకల్: పురుగుల మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన సంఘటన మల్దకల్‌లో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ గోపాల్‌నాయక్ వివరాల మేరకు.. మల్దకల్ గ్రామానికి చెందిన జయలక్ష్మి (26) గత నెల 26న వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా ఆమెతో భర్తకు సెల్‌ఫోన్ లభించింది. దీంతో భర్త ఆమెను మందలించాడు. దీంతో మనస్థాపం చెందిన భార్య వ్యవసాయ పొలంలోనే గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబీకులు ఆమెను గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. భర్త నర్సింహులు, కుమార్తె ఉన్నారు.

జూరాలకు 1.35 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- ప్రాజెక్టు 15 క్రస్టు గేట్ల ఎత్తివేత
- 1.38 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు..


జూరాల 15 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

ధరూరు/ఆత్మకూర్: కర్ణాటక, మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు సోమవారం రాత్రి 7.30 గంటల వరకు 1.35 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు15 క్రస్టు గేట్లను ఎత్తి గేట్ల ద్వారా 1.06లక్షల క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 30,422 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 45 క్యూసెక్కులు, కుడి కాల్వకు 290 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 1.38 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.969 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆల్మట్టి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 121.606 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 1.32 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. నారాయణపూర్ ప్రాజెక్టుకు 30,370 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 32.60 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 60వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 14 క్రస్టు గేట్లను ఎత్తి 54,720 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

465.133 ఎంయూ విద్యుదుత్పత్తి
ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ విద్యుదుత్పత్తి కేంద్రంలో 5 యూనిట్ల ద్వారా 213.031 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 252.102 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు.

శ్రీశైలానికి 2లక్షల క్యూసెక్కుల వరద

దోమలపెంట: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి సోమవారం 2.14 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తుంది. జూరాలలో ఆనకట్ట స్పిల్‌వే ద్వార 1.06లక్షల క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 30,422 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 67,312 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 10,040 క్యూసెక్కుల వరద శ్రీశైలానికి చేరుకుంటోంది. శ్రీశైలం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 30,887 మొత్తం 66,202 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 881.8 అడుగుల నీటిమట్టం వద్ద 197.9120 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వార 32 వేలు, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,818, ఎంజీకేఎల్ఐకు 1,160 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.626 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 15.049 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

సుంకేసులలో 16 గేట్ల ద్వారా నీటి విడుదల

రాజోళి: కురుస్తున్న వర్షాల కారణంగా సుంకేసుల డ్యాం కు 70వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 16 గేట్లను మీటర్ మేర తెరిచి 67,312 క్యూసెక్కుల నీటిని దిగువకు, కేసీ కెనాల్‌కు 2,012 క్యూసెక్కులు కలిపి 69,324 క్యూసెక్కులు నీటిని వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు

గద్వాల క్రైం: జిల్లాకు చెందిన ఇద్దరు యువకులను సోమవారం ఉదయం హైదరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. స్థానికుల కథనం మేరకు.. గద్వాల మండలంలోని వీరాపురం, లత్తీపురం గ్రామాలకు చెందిన ఇద్దరు యువకులు ఆన్‌లైన్ నగదు చెల్లింపుల విషయంలో సమస్యాత్మకంగా వ్యవహరించినట్లు అక్కడి పోలీసులకు ఫిర్యాదులు అందాయి. అందుల్లో భాగంగానే హైదరాబాద్‌కు చెందిన పోలీసులు ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయంపై రూరల్ ఎస్ఐ శ్రీకాంత్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. హైదరాబాద్‌కు చెందిన పోలీసులు వచ్చిన విషయం వాస్తవామేనని, అదుపులోకి తీసుకున్న యువకులను ఎందుకు తీసుకున్నారనే విషయంపై స్పష్టత లేదన్నారు.

భిక్షాటన చేసి ఆలయానికి రూ.1.83 లక్షలు విరాళం


బిక్షటన చేసిఆలయ నిర్మాణానికి రూ.1.83 లక్షలు అందించిన రంగమ్మ

కృష్ణా: ఓ మహిళా యాచకురాలు బిక్షాటన చేస్తూ ఏకంగా రూ.1.83 లక్షలు పోగు చేసింది. ఆ మొత్తాన్ని ఓ ఆలయ నిర్మాణానికి విరాళంగా ఇచ్చి ఎందరికో ఆదర్శంగా నిలిచింది. వివరాల్లోకి వెళ్తే.. తెలంగాణకు చెందిన వృద్ధురాలు రంగమ్మ కొన్నేళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు చేరుకుంది. ఆమెకు ఎవరూ లేకపోవడంతో బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తుంది. తన అవసరాలను తీర్చుకోగా మిగిలిన డబ్బును కొద్ది కొద్దిగా జమ చేస్తూ వచ్చింది. ఇలా కొన్నేళ్ల పాటు జమ చేయగా.. మొత్తం రూ.1.83 లక్షలు అయ్యింది. ఈ మొత్తాన్ని రాయచూర్ జిల్లాలోని బిజనగేరి ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి విరాళంగా ఇచ్చి దేవుడిపై తన భక్తిని చాటుకుంది. రూ.కోట్లు సంపాయిస్తున్న వారు సైతం రూ.వెయ్యి విరాళం ఇచ్చేందుకు వెనకాడే ఈ రోజుల్లో ఏళ్ల తరబడి రూపాయి రూపాయి కూడబెట్టుకొని రూ.లక్షలు జమ చేసి ఆలయానికి విరాళంగా ఇవ్వడంపై ఇరు రాష్ట్రాల ప్రజలు రంగమ్మ పెద్ద మనస్సును కొనియాడుతున్నారు.

ఆధునికతకు ఆమడదూరం!


కళాశాల గ్రంథాలయం కంప్యూటర్‌లో విజ్ఞానాన్ని వెతుక్కుంటున్న విద్యార్థినులు, పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

- డిజిటలైజేషన్‌కు నోచుకోని గ్రంథాలయాలు
- గుర్తింపునకు తాపత్రయ పడుతున్న గ్రంథపాలకులు
- నేడు జాతీయ గ్రంథాలయ అధికారుల దినోత్సవం

జడ్చర్ల టౌన్: స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన గ్రంథాలయాలు నేటికీ సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో పూర్తిగా వెనకబడి ఉండగా.. అందులో పనిచేస్తున్న గ్రంథపాలకుల పరిస్థితి అయోమయంగా మారింది. విజ్ఞాన భాండాగారాలుగా పిలుచుకుంటున్న గ్రంథాలయాల్లో వేలాది పుస్తకాలు ఉన్నప్పటికీ మనకు కావాల్సిన పుస్తకాలను వెంటనే అందించే అద్భుతమైన ప్రావీణ్యం మన గ్రంథపాలకుల్లో ఉంది. ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ లైబ్రేరియన్స్ డే జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. అయితే తమకు సరైన గుర్తింపు లభించడంలేదని, గ్రంథాలయాలు ఆధునీకరణకు నోచుకోవడంలేదని వాపోతున్న లైబ్రేరియన్స్ గూర్చి తెలుసుకుందాం.

తండ్రిపేరిట రెనోవేషన్
డా.బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయం ఇరుకుగదుల్లో ఉండేది. రెండేళ్లక్రితం లైబ్రేరియన్‌గా బదిలీపై వచ్చిన ఆంజనేయులు ఎలాగైనా ఆధునీకరించాలని లక్ష్యంగా ముందడుగు వేశాడు. అందుకు దాతల సహాయం ఆర్జించినప్పటికీ ఎవరు సహకరించలేదు. ఇదే సమయంలో కళాశాలలోని రెండు గదులు అందుబాటులోకి రావడంతో దాంట్లోకి లైబ్రరీని మార్చాలని నిర్ణయించుకుని తన తండ్రి ఇప్పల నాగభూషణం స్మారకార్థం రూ.లక్ష వెచ్చించి గదులను తనకు అనుకూలంగా మార్చుకుని గ్రంథాలయాన్ని కిందకు బదలాయించారు. ప్రస్తుతం రెండు పెద్ద గదుల్లో 108 ర్యాక్స్‌లో 26వేల పుస్తకాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. నిరుపయోగంగా ఉన్న మూడు కంప్యూటర్లను ప్రిన్సిపాల్ అనుమతితో గ్రంథాలయంలో ఏర్పాటు చేశారు. నిత్యం 150నుంచి 200మంది విద్యార్థులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పుస్తకపఠనం చేసేందుకు వస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 69 శాఖ గ్రంథాలయాలు ఉన్నాయి. వీటిలో కేవలం 14గ్రంథాలయాలకు మాత్రమే లైబ్రేరియన్స్ ఉన్నారు. మిగిలిన వాటిలో ఇన్‌చార్జిలు, ఔట్‌సోర్సింగ్‌తో నెట్టుకొస్తున్నారు. ఇక 68 జూనియర్ కళాశాలలకుగానూ 44 కళాశాలల్లో మాత్రమే లైబ్రేరియన్ పోస్టులున్నాయి. వాటిలో కేవలం 22మంది లైబ్రేరియన్‌లు మాత్రమే పనిచేస్తున్నారు. శాఖ గ్రంథాలయాలు, జూనియర్ కళాశాలల్లోని గ్రంథాలయాల్లో ఎక్కడ డిజిటలైషన్ జరగలేదు. పాత పద్ధతిన పంచసూత్రాల ఆధారంగానే పుస్తకాల అమరిక, పాఠకుడికి అందించడం జరుగుతుంది.

డిజిటలైజేషన్ కావాలి


సాంకేతికతకు అనుగుణంగా లైబ్రరీలు డిజిటలైజేషన్‌కు నోచుకోవాలి. ప్రభుత్వం ఇందుకు దృష్టిసారించాలి. మా డిగ్రీ కళాశాలలోని లైబ్రరీకి మరిన్ని కంప్యూటర్లు వస్తే విద్యార్థులకు ఎంతో ప్రయోజనంగా ఉంటుంది. అలాగే లైబ్రేరియన్స్ డేను అధికారికంగా నిర్వహించి ఉత్తమ పురస్కారాలు అందిస్తే మరింత ఉత్సాహంతో పనిచేయటానికి వీలుంటుంది.
– ఆంజనేయులు, లైబ్రేరియన్, జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల

అమలుకాకుండానే పదవీ విరమణ


లైబ్రేరియన్స్ డేను ప్రభుత్వం అధికారికంగా జరుపుతుందని ఆశించినప్పటికీ అది జరగకుండానే పదవీ విరమణ పొందాను. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి. శాఖ, కళాశాలల్లోని గ్రంథాలయాల్లో డిజిటలైజేషన్ అమలు చేయాలి. పూర్తి స్థాయి నియామకాలు జరిపితే విజ్ఞానాన్ని ప్రజలకు చేరువ చేసే ఆస్కారం కలుగుతుంది.
– జయప్రకాశ్, రిటైర్డ్ లైబ్రేరియన్, జడ్చర్ల


ఆధునీకరించబడిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని గ్రంథాలయం

గుర్తింపునకు తాపత్రయం

ఉపాధ్యాయ దినోత్సవం మాదిరిగానే లైబ్రేరియన్స్ డేను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని లైబ్రేరియన్స్ కోరుకుంటున్నారు. ప్రతిఏటా ఉత్తమ లైబ్రేరియన్ అవార్డులు ఇచ్చి ప్రోత్సహించాలని, గ్రంథాలయాలను ఆధునీకరించి పాఠకుడికి మరింత చేరువ తీసుకురావాలని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

ఉమ్మడి జిల్లాలో 6 పెద్ద డిగ్రీ కళాశాలలు ఉండగా.. ఐదింటిలో డిజిటలైషన్ జరిగింది. ఒక్కో కళాశాల లైబ్రరీలో 14వరకు కంప్యూటర్లు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. జడ్చర్ల డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాత్రం డిజిటలైజేషన్ అమలు కాలేదు. అందుకు కారణాలు ఏవైనా.. విద్యార్థులకు ఆధునికత అందకుండాపోయింది.

చోరీ చేసిన వ్యక్తికి 8నెలల జైలుశిక్ష

కొత్తకోట రూరల్: చోరీ కేసు రుజువైనందున నేరస్తుడికి 8నెలలు జైలు శిక్షతోపాటు రూ.100 జరిమానా విధించి శనివారం ఆత్మకూర్ కోర్టు న్యాయమూర్తి శిరీష తీర్పు ఇచ్చినట్లు వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. డీఎస్పీ కథనం ప్రకారం.. కొత్తకోట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనిమెట్టలో జనవరి 2న తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసి బంగారం, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితురాలు మౌనిక ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఆనంద్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు వివిధ కోణాల్లో దర్యాప్తు చేసిన ఎస్ఐ మార్చి 21న కొత్తకోటలో అనుమానంగా తిరుతున్న మధ్యప్రదేశ్‌కు చెందిన రాహుల్ బచ్చాడను పట్టుకుని విచారించగా.. చోరీ చేసినట్లు ఒప్పుకొన్నాడు. కోర్టులో సాక్ష్యాలతో నిరూపించగా సోమవారం జడ్జి నిందుతుడికి శిక్ష విధించారు.

కమాలొద్దీన్‌పూర్ బ్రాంచ్‌కెనాల్‌కు కోత


అల్లమాయపల్లి శివారులో బ్రాంచ్ కెనాల్ తెగి పొలాల్లోకి పారుతున్న నీళ్లు


కెనాల్ నీళ్లు పారడంతో వరిపంటలో వేసిన ఇసుక మేటలు

- పంటపొలాల్లో పారిన కాల్వనీళ్లు
- ఇసుక మేటలతో దెబ్బతిన్న వరి పంట
- ఆదుకోవాలని అన్నదాతల వేడుకోలు

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాలకు సాగునీరందించే కమాలొద్దీన్‌పూర్ బ్రాంచ్‌కెనాల్ తెగిపోవడంతో వరి, పత్తి పంటలు పాడైపోయాయి. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బ్రాంచ్‌కెనాల్ అల్లమాయపల్లి శివారులో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద తెగిపోయింది. కాల్వ, వర్షపు నీళ్లు పెద్దఎత్తున పంట పొలాల్లో పారడంతో రైతు శేషయ్యకు చెందిన వరిపంట పెద్దఎత్తున నీటిలో మునిగిపోయింది. పొలంలో ఇసుక మేటలు వేయడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నాడు. రూ.లక్షలు వెచ్చించి ఇటీవలు వరి సాగుచేయగా.. కాల్వ తెగి ఇసుక మేటలు వేయడంతో ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు పరిశీలించి కాల్వ నీళ్లు రాకుండా చేయాలని ప్రభుత్వం నుంచి తనకు ఆర్థిక సాయం అందేలా చూడాలని వేడుకొంటున్నాడు.

అప్పారెడ్డిపల్లి కాల్వకు..

మండలంలోని అప్పారెడ్డిపల్లికి సాగునీందించే కాల్వకు బుడ్డఏనె దగ్గర ఏర్పాటు చేసిన పైపు మరీ చిన్నదిగా ఉండడంతో పాటుకాల్వలోకి నీళ్లు నేరుగా వెళ్లకుండా పిచ్చిమొక్కలు ఉండడంతో ఆదివారం కురిసిన వర్షానికి నీళ్ళు పంటపొలాల మీదుగా పారాయి. ఆ ప్రాంతంలోని చెన్నకేశవులు, చెన్నయ్య తదితర రైతులకు సంబంధించిన పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి. వెంటనే కాల్వ వద్ద మరమ్మతు పనులు చేపట్టి నీళ్ల పొలాలకు రాకుండా చూడాలని, లేకుంటే తమ పంటలు పూర్తిగా నీటిలో మునిగి నష్టపోతామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వచ్చాం.. చూశాం.. వెళ్లాం అన్నట్లు కాకుండా మరమ్మతులు చేసి రైతులను ఆదుకోవాలని ఆయా గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

దేవరకద్ర/భూత్పూర్: రైతుబీమా కోసం ఈ నెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓలు రాజేందర్ అగర్వాల్, మురళీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డులో 18ఏళ్ల నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన రైతులు బీమాకు అర్హులని వివరించారు. దరఖాస్తు ఫారంతోపాటు రైతు పట్టాదారు పాసుపుస్తకం, తహసీల్దార్ డిజిటల్ సంతకం చేసి ఉండాలని, రైతు ఆధార్ కార్డు జిరాక్స్, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్‌ను జతపరి సంబంధిత ఏఈవోలకు అందజేయాలని కోరారు. జూన్5 వరకు పట్టాదారుపాసు పుస్తకం, ఇంతవరకు రైతుబీమా చేసుకోని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

8 గంటలపాటు భగీరథ నీళ్లు బంద్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఈనెల 13వ తేదీన ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మిషన్ భగీరథ నీళ్ల సరఫరా నిలిచిపోనున్నట్లు గ్రిడ్ మిషన్ భగీరత ఈఈ శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోతులమడుగు వద్ద రాజీవ్ స్వగృహ ఓహెచ్ఎస్ఆర్‌కు మిషన్ భగీరథ పైపులైన్ కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ పని పూర్తి కావడానికి 8గంటల సమయం పడుతుందని దీంతో లాల్యతండా ఓహెచ్‌బీఆర్‌కు వాటర్ రానందున భూత్పూర్ మున్సిపాలిటీలోని 13గ్రామాలకు నీళ్ల సరఫరా నిలిచిపోనున్నట్లు తెలిపారు.

అభ్యర్థులను గెలిపించాలి

దేవరకద్ర రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి అన్నారు. సోమవారం వెంకటాయపల్లి, గద్దెగూడెంలో నాయకులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రతికార్యకర్త సమిష్టిగా కృషిచేసి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు హనమంత్‌రెడ్డి, రాజశేఖర్, గోపాల్, చంద్రమౌళి, రాంబాబు, ఉస్సేనప్ప, జైపాల్‌రెడ్డి, జాఫర్, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ, రోడ్లు నిర్మించాలని వినతి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మర్లులోని వాటర్‌ట్యాంక్, రోడ్డు నం.3 పరిసర ప్రాంతాలలో డ్రెయినేజీలు, రోడ్లు అస్తవ్యస్తంగా మారాయని స్థానికులు వాపోయారు. ఈ మేరకు సోమవారం ఈ ప్రాంతాలలో పర్యటించిన మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. కాగా, వీలైనంత త్వరగా ఈ సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానికులు ముఖరంజన్, పాండునాయక్, పద్మ, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: భగీరథకాలనీ నుంచి మధురానగర్ వరకు మెయిన్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్‌నకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆయా కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలి

నవాబుపేట: మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను రెండురోజుల్లో ప్రారంభించాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు సమావేశంలో మాట్లాడుతూ.. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పనులు చేపట్టకుంటే రద్దవుతాయని తెలిపారు. మండలానికి మొదటి విడతలో 655 ఇళ్లు మంజూరు కాగా.. వాటిలో ఇంకా 173 ఇళ్లు ప్రారంభంకావాల్సి ఉందన్నారు. పారిశుద్ధ్యం విషయంలో పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉపాధి పనులకు చెందిన రికార్డులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ నసీర్‌అహ్మద్, హౌసింగ్ ఏఈ శ్రావణి, ఏపీఓ జ్యోతి తదితరులు ఉన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయ ఎదుట ఆక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణా సముదాయాలను వెంటనే తొలగించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్ నర్సింగ్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఇరువైపులా ఫుట్‌పాత్, డ్రెయినేజీని ఆక్రమించి దుకాణాలు నిర్మించారని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసినవారిలో కృష్ణయ్య, వెంకటయ్య ఉన్నారు.

కొట్టం కూలి మేకలు మృతి

మహమ్మదాబాద్: గాలీవాన బీభత్సంతో పశువుల కొట్టం కూలి ఆరు మేకలు మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. జూలపల్లికి చెందిన కొత్లాబాద్ మంజులకు చెందిన మేకలను మేపి పొలం దగ్గర కొట్టంలో కట్టేసి ఇంటికి వచ్చారు. సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ గాలీవానకు పశువుల కొట్టం సిమెంటు రేకులు కూలి 6మేకలు అక్కడికక్కడే చనిపోయాయి. మిగతా 15మేకలు తీవ్ర గాయాలపాలయ్యాయి. చనిపోయిన ఆరు మేకల విలువ రూ.90వేల వరకు ఉంటుందని బోరున విలపించారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆశలు ఆవిరి



స్థలాన్ని పరిశీలిస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి(ఫైల్)

- గండేడ్‌లో ఉదయించని 'నవోదయం'
- నెలల తరబడి పడిన కష్టం వృథా
- నిరాశలో గండేడ్ వాసులు

గండేడ్: ఆరునెలలుగా మండలవాసులు పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయి. గండేడ్‌లో మరో విద్యాహారం వస్తుందనుకున్న తరుణంలో నవోదయ పాఠశాల చేజారి పోవడంతో గండేడ్ మండల వాసుల్లో నిరాశ నిస్పృహలు చోటుచేసుకున్నాయి. జిల్లాలో గండేడ్ మండలానికి జవహర్ నవోదయ పాఠశాల మంజూరైనట్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి గతంలో ప్రకటించారు. గండేడ్ మండలంలో 27 పంచాయతీలు 13తండాలు ఉన్నాయి. విద్యాపై తన్యం ఎక్కువగా ఉన్న గండేడ్ మండలానికి నవోదయ పాఠశాల రావడం సంతోషం కలిగించింది. జిల్లాలో ఉన్న ఏకైక మోడల్ స్కూల్ కూడా గండేడ్ మండలంలోనే ఉంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని మరో విద్యాహారాన్ని గండేడ్ సిగలో చేర్చడానికి ఎమ్మెల్యే గట్టిగా కృషి చేసినా.. చివరికి చేజారినట్లయింది.

పేరుకే ఫైనల్..

నవోదయ ఏర్పాటుకు జంగంరెడ్డిపలి సమీపంలోని ప్రభుత్వ భూములను ఆర్డీఓ, అదనపు కలెక్టర్ మోహన్‌రావు రెండుసార్లు పరిశీలించారు. ఇది నవోదయ నిబంధనలకు అనుకూలంగా లేకపోవడంతో పక్కన పెట్టారు. చిన్నవార్వాల్, పెద్దవార్వాల్ భూములు పరిశీలించారు. చివరకు సల్కర్‌పేట్ శివారులో అంతర్‌గంగలింగేశ్వరస్వామి ఆలయం వెనకున్న 58సర్వే నెంబరులో 25ఎకరాలకుపైగా భూమిని ఫైనల్ చేసి అధికారులకు నివేదిక పంపారు. ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ కూడా పాఠశాల ఏర్పాటుకు అనుకూలంగా ఉందని చెప్పడంతో ఎమ్మెల్యే ఈ స్థలాన్నే ఫైనల్ చేయాలని కలెక్టర్ విజయేందిరబోయిని కోరారు. దీన్ని జవహర్ నవోదయ అనుమతి కోసం కేంద్రానికి నివేదించారు. అనుకోని రీతిలో బాలార్‌నగర్ మండలానికి తరలిపోవడంతో గండేడ్‌వాసుల ఆశలు ఆవిరయ్యాయి. జాతీయ రహదారి ఆనుకొని పెద్దాయిపల్లి శివారులో నిర్మించేందుకు స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ మేరకు నవోదయ పాఠశాల జాయింట్ కమిషనర్ సమీర్‌పాండే ఉత్తర్వులు జారీచేశారు.

ఎంపీ పట్టుదల మేరకే..

నవోదయ పాఠశాల బాలానగర్ మండలానికి తరలిపోవడానికి ప్రధాన కారణం ఎంపీ డీకే అరుణ. జిల్లాకు నవోదయ పాఠశాల మంజూరైనప్పటి నుంచి గట్టిగా ప్రయత్నించారు. ఓ వైపు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి హామీతో గండేడ్‌లో ఏర్పాటు చేయడానికి శతవిధాలా ప్రయత్నించారు. సల్కర్‌పేట్‌లో ఏర్పాటు చేయాలని ఆరునెలలుగా అధికారుల వెంటపడి ముందుకుసాగారు. మరోవైపు ఎంపీ కూడా తన సెగ్మెంట్‌లో ఏర్పాటు చేయాలని సంకల్పించారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కూడా ఎలాగైనా తమ నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని ప్రయత్నించారు. వీటికి తోడు పాఠశాల ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలం జాతీయ రహదారికి దగ్గర ఉండడం కలిసి వచ్చింది.

ఆరునెలల శ్రమ వృథా



నవోదయ పాఠశాల ఏర్పాటుకు నానా రకాలుగా శ్రమించాం. పలు గ్రామాల్లో స్థలాలు చూసి సర్వేలు చేశాక వద్దన్నారు. చివరకు సల్కర్‌పేట్ స్థలం ఫైనల్ అని చెప్పి చివరకు వేరే మండలానికి కేటాయించారు. ఎమ్మెల్యే, అధికారులు, ప్రజాప్రతినిధుల శ్రమంతా వృథా అయ్యింది.

– జితేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, గండేడ్

గండేడ్ అంటేనే చిన్నచూపు..

గండేడ్ మండలంపై ఆదినుంచి చిన్నచూపే ఉంది. 2017లో మండలాలు, జిల్లాల పునర్విభజనలో ఉమ్మడి మండలాన్ని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి మహబూబ్‌నగర్‌లో కలిపారు. జిల్లా మహబూబ్‌నగర్.. నియోజకవర్గం పరిగి. పార్లమెంట్ నియోజకవర్గం వచ్చేసి చేవేళ్ల. దీంతో ఉమ్మడి మండల అభివృద్ధికి నిధుల కేటాయింపులోనూ తగిన ప్రాధాన్యం ఇవ్వడంలేదు. ఆశల పల్లకిలో ఊగిసలాడిన నవోదయ రాకపోవడంతో మండలవాసుల ఆరోపణలకు మరింత బలం చేకూరిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏదీఏమైన మరో మణిహారం కలగానే మిగిలిపోయింది.

పల్లెల్లో సమస్యలు పరిష్కరించాలి



కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జడ్చర్ల టౌన్: పల్లెల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఈ మేరకు సోమవారం మండలంలోని బూర్గుపల్లిలో సమస్యలపై సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అనేక సమస్యలు పేరుకుపోయాయని, సీసీరోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్య, వీధిలైట్లు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు వంటివి అన్ని గ్రామాల్లోనూ ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించే దిశగా అధికారులు అడుగులు వేయడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు సమస్యలపై దృష్టిసారించాలని డిమాండ్ చేశారు. సర్వే అనంతరం పంచాయతీ కార్యదర్శి శశిధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యాదయ్య, స్వామి, రాంచంద్రమ్మ, నాగరాజు, మహేశ్, పరశురాం, వెంకటేశ్, రంగయ్య పాల్గొన్నారు.

ఐదు గంటల్లో ఛేదన

మహబూబ్‌నగర్ క్రైం: జనరల్ ఆస్పత్రిలో స్కానింగ్ కోసం వచ్చిన మహిళ పుస్తెలతాడును గుర్తు తెలియని మరో మహిళ తీసుకువెళ్లింది. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. ధన్వాడ మండలం కొండాపూర్‌కు చెందిన అనంతమ్మ ఈనెల 10న ఛాతిలో నొప్పిరావడంతో జనరల్ ఆస్పత్రికి వచ్చింది. సీటీ స్కాన్ చేసుకోవడానికి మెడలో ఉన్న 12 గ్రాముల బంగారం పుస్తెలతాడు, కమ్మలు తీసి ఒక కవర్‌లో వేసి పక్కన పెట్టుకుంది. స్కానింగ్ తర్వాత చూస్తే కవర్ కన్పించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఐదుగంటల వ్యవధిలో ఛేదించినట్లు తెలిపారు. చోరీకి పాల్పడిన మహిళ శాంతమ్మను 5గంటల్లో అదుపులోకి తీసుకుని బంగారం వస్తువులను రికవరీ చేసినట్లు వెల్లడించారు. ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్‌ తరలించినట్లు తెలిపారు.

మహెఫిలే నాతే పోస్టర్ ఆవిష్కరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: అంజుమనే ఫైజానే షర్ఫియా ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ నుంచి సెప్టెంబర్ 4 వరకు మహెఫిలే నాతే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గయాజ్‌పాషా ఖాద్రీ హకం షర్ఫీ, బుర్హాన్ ఖాద్రీ షర్ఫీ వెల్లడించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బర్హానే బాద్‌షా దర్గా ఆవరణలో కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మతపెద్దలు మౌలానా మొహసిన్‌పాషా ఖాద్రి, చందా హుస్సేని, జహంగీర్‌పాషా ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

కూలిన ప్రహరీ

జడ్చర్ల టౌన్: కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలోని కొత్తబజార్ ప్రాథమిక పాఠశాల, ఉర్దూమీడియం హైస్కూల్ కంబైడ్ ప్రహరీ కూలిపడింది. వర్షాల కారణంగా ఆదివారం రాత్రి ప్రహరీ కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. కూలిన ప్రహరీని నిర్మించాలని రెండు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాల్సిందే..

పాదయాత్రగా కలెక్టరేట్‌కు చేరుకొని బీజేపీ నాయకుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

మహమ్మదాబాద్: ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చిన ఆరుగ్యారంటీలను అమలు చేయకుంటే ఆందోళన తప్పదని బీజేపీ మండలాధ్యక్షుడు మూస నర్సింహులు పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలపై బీజేపీ పాదయాత్రలో భాగంగా సోమవారం రెండో రోజు పాదయాత్రగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆరు గ్యారంటీల పోస్టరుతో నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ తప్పకుండా అమలు చేయాలని లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అమలుకాని పథకాలతో ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. స్థానిక ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. ఇలాంటి పథకాలను తీసుకుని గ్రామగ్రామాన తిరిగి ఎండగట్టాలని కార్యకర్తలకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులు తప్పిస్తే రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి రూపాయి ఖర్చు చేయడం లేదని విమర్శించారు. అందుకు బీజేపీ ఆధ్వర్యంలో ప్రతి కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, సురేశ్, శ్రీనివాసులు, పవన్, ప్రభునాయక్, కృష్ణ, ఆయా గ్రామాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల శారీరక గుర్తింపు తప్పనిసరి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తమ శారీరక ప్రత్యేక గుర్తింపు తప్పనిసరి అని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాయిలుగౌడ్, ప్రధాన కార్యదర్శి అంజయ్యచారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 75ఏళ్లు దాటిన ప్రతి పెన్షనర్ తన ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్, బ్యాంక్ పాస్‌బుక్, పీపీఓ ఐడీ జిరాక్స్ కాపీలతో ఈనెల 21వ తేదీలోగా డీటీఓ పరిధిలోని ఎస్టీఓ కార్యాలయాలకు వెళ్లి రిజిస్టర్‌లో సంతకం చేయాలని సూచించారు. ఎవరైనా ఇతర ప్రదేశాల్లో ఉండి అనారోగ్యంతో రాలేని పరిస్థితుల్లో ఉంటే వారి గురించి తరువాత తెలియజేస్తామని పేర్కొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి



విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణ



నంచర్ల గురుకుల పాఠశాలలో మాత్రలు వేయిస్తున్న వైద్యాధికారులు

జిల్లా వైద్యాధికారి కృష్ణ

సాక్షి, నెట్‌వర్క్: విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని డీఎంహెచ్‌ఓ కృష్ణ అన్నారు. సోమవారం భూత్పూర్ మండలంలోని రాజీవ్ స్వగృహలో నిర్వహిస్తున్న మహాత్మాజ్యోతిబా పూలే రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు తప్పకుండా మాత్రలు వేయాలని వైద్యాధికారి అబ్దుల్‌రబ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ప్రిన్సిపాల్ సుగణశ్రీ,, ఉపాధ్యాయులు ఉన్నారు.

- బాలబాలికల్లో నులిపురుగుల సమస్య నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిఏటా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం దేవరకద్ర బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ బలరాం, వైద్యుడు శరత్‌చంద్ర, మార్కెట్ చైర్మన్ కథలయ్య, మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, రాజశేఖర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.
- మిడ్జిల్‌మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, అంగన్‌వాడీ, ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జడ్చర్ల మార్కెట్ కమిటీ చైరపర్సన్ జ్యోతిఅల్వాల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివకాంత్, జీహెచ్ఎం సరస్వతి, నాయకులు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.
- నవాబుపేట మండలంలోని యన్మన్‌గండ్ల పాఠశాలలో నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ ప్రారంభిపంచారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.
- గండేడ్ మండలంలోని వెన్నచేడ్, పెద్దవార్వాల్, కొంరెడ్డిపల్లి, రెడ్డిపల్లి, సల్కర్‌పేట్‌లో విద్యార్థులకు ఎంపీడీఓ హరిచంద్రారెడ్డి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ జనార్దన్, మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.
- మహమ్మదాబాద్ మండలంలోని అంగన్‌వాడీ, పాఠశాలల్లో విద్యార్థులకు వైద్యాధికారి బిందు రాణి నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ హన్మంతు, సూపర్‌వైజర్ మన్సూర్, ఏఎన్ఎం కొండమ్మ, నంచర్ల గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.
- చిన్నచింతకుంట మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులకు తహసీల్దార్ ఎల్లయ్య, పీహెచ్‌సీ వైద్యురాలు శిరీష ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ హేమలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కలెక్టర్ విజయేందిరబోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యార్థులకు అందించే ఆహారంలో మెనూ ప్రకారం వేడిగా, తాజా కూరగాయలను మాత్రమే ఉపయోగించాలని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. సోమవారం మెట్టుగడ్డలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడున్న విద్యార్థులతో ముచ్చటించారు. ఎలా చదువుతున్నారని ఏం చదువుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆర్ఓఆర్ ప్లాంట్, స్టోర్ రూం, లైబ్రరీ, వంటగదిని పరిశీలించారు. తాజా కూరగాయలు ప్రతిరోజూ తెచ్చుకోవాలని, వండిన వంటకాలపై మూతలను మంచిగా మూయాలని, సామగ్రి ఎక్కడ పడితే అక్కడ పెట్టకూడదని, మీ ఇంట్లో ఇలానే పెట్టుకుంటారా అని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఏటీసీని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

ఏటీసీని పరిశీలన

జిల్లా కేంద్రంలోని అడ్వాన్స్‌డ్ ట్రెనింగ్ సెంటర్(ఏటీసీ)ని సోమవారం కలెక్టర్ విజయేందిర బోయి సందర్శించారు. భవన నిర్మాణ పనులు, యంత్ర సామగ్రి, ఇన్‌స్టాలేషన్ పనులు, ట్రెనింగ్ కార్యకలాపాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ శాంతయ్య, గోపాల్‌నాయక్, ఏటీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



రేషన్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్(బాలానగర్): రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవాడి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బాలానగర్ మండల కేంద్రంలో లబ్ధిదారులకు మంజూరైన రేషన్‌కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. బాలానగర్‌లో 850 కొత్తరేషన్ కార్డులు 3, 963మందిని కార్డుల్లో చేర్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. బాలానగర్ మండలానికి రీజినల్ రింగ్ రోడ్డు రాబోతోందని తెలిపారు. పెద్దాయపల్లిలో ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన చేసుకున్నామని, నవోదయ పాఠశాల కూడా మంజూరు కావడంతో విద్యాభివృద్ధిలో బాలానగర్ నెంబర్ వన్‌గా నిలువబోతోందన్నారు. అనంతరం మహిళలు ఎమ్మెల్యేకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శంకర్, దత్తుకుమార్, తిరుపతి, వెంకట్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవాలు



జడ్చర్ల టౌన్: పట్టణంలోని రాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం 354వ ఆరాధన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సుప్రభాతసేవ, అష్టోత్తర పారాయణం, పాదపూజ, కనకాభిషేకం, పంచామృతాభిషేకం, తులసీ అర్చనలు చేశారు. వస్త్రసహిత పుష్పాలంకరణ చేసి భక్తులు భజనలు, గేయాలతో స్వామిని ఆరాధించారు. కార్యక్రమంలో రాఘవేంద్రస్వామి మఠం అర్చకులు బాలకృష్ణాచార్యులు, భీంసేనాచార్యులు, రాఘవేంద్రచార్యులు, విఠలయ్య, పాండు, రాఘవేంద్ర, సుదర్శన్‌శర్మ, రాఘవేందర్, రాధాకృష్ణ, బుచ్చయ్య పాల్గొన్నారు.

సహాయ నిధి చెక్కు అందజేత

గండేడ్: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్నివర్గాలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండాపూర్‌కు చెందిన రాయిని నిర్మలమ్మకు మెరుగైన వైద్య కోసం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును సోమవారం బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో కొండాపూర్ కార్యదర్శి సుష్మిత, వెంకటేశ్, మధు, దస్తయ్య, ఆంజనేయులు, రాయిని ఆంజనేయులు పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం: కేసు నమోదు

రాజాపూర్: పింఛన్ తెచ్చుకుంటానని ఇంటినుంచి వెళ్లిన వృద్ధురాలు పదిరోజులైనా తిరిగి రాకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసునమోదు చేసినట్లు ఎస్ఐ శివానందంగౌడ్ తెలిపారు. ఇబ్రహీంపల్లికి చెందిన మల్లెపాగ వెంకటమ్మ ఈనెల 1న రాజాపూర్‌లో పింఛన్ తెచ్చుకుంటానని ఇంటినుంచి వచ్చి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం వెంకటమ్మ కుమారుడు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లోకిరేవులో రుద్రాభిషేకాలు

నవాబుపేట: మండలంలోని లోకిరేవులో శ్రావణ సోమవారం సందర్భంగా వీరభద్రస్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రధాన పూజారులు లింగయ్య స్వామి, రాజుస్వామి ప్రసాదాలు అందించారు.

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ



చిన్నారులకు మాత్రలు తినిపిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసీంసుల్తానా

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక టీడీగుట్టలోని 2, 6వ అంగన్‌వాడీ కేంద్రాలలో సోమవారం చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు తినిపించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసీంసుల్తానా, అంగన్‌వాడీ టీచర్ సునంద, సహాయకురాలు సుల్తానా, ఆశా కార్యకర్తలు నూర్జహాన్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సందర్శించిన చైర్మన్



కావేరమ్మపేటలో వివరాలు తెలుసుకుంటున్న చైర్మన్ నర్సింహారెడ్డి

జడ్చర్ల టౌన్: బాదేపల్లి, కావేరమ్మపేట, భూత్పూర్ శాఖ గ్రంథాలయాలను సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల్లో ఉన్న సౌకర్యాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పుస్తకాల వివరాలు, పాఠకుల స్పందనపై ఆరా తీశారు. గ్రంథాలయానికి కావాల్సిన సదుపాయాల గూర్చి విచారించారు. ఆయన వెంట గ్రంథాలయ జిల్లా కార్యదర్శి మనోజ్ కుమార్, సభ్యులు శ్యాంసుందర్, మహేశ్, బాదేపల్లి గ్రంథపాలకురాలు లక్ష్మి, కావేరమ్మపేట సిబ్బంది భీష్మాచారి, భూత్పూర్ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను సంబరంగా జరుపుకొందాం



మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌ను కలిసిన శతాబ్ది ఉత్సవ కార్యవర్గం

జడ్చర్ల టౌన్: బాదేపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలను సంబరంగా జరుపుకొందామని మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన నివాసంలో శతాబ్ది ఉత్సవ కమిటీ కలుసుకుని ఉత్సవాల నిర్వహణపై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులతోపాటు నియోజకవర్గంలోని ప్రతిఒక్కరూ భాగస్వామ్యమై ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. నేటికాలంలో ప్రభుత్వ పాఠశాల వందేళ్లు పూర్తిచేసుకోవడం, నేటికీ ఏమాత్రం తగ్గకుండా సంఖ్య ఉండడం గర్వకారణమన్నారు. ఆయనను కలసిన వారిలో ఎంఈఓ మంజులాదేవి, హెచ్ఎం చంద్రకళ, శతాబ్ది ఉత్సవ కమిటీ కార్యవర్గం ఉన్నారు.

డెట్స్ రికవరీ అప్పిల్లేట్ ట్రిబ్యునల్‌లో : కోల్‌కతా వద్ద

Diary No. 558 OF 2025

బ్యాంక్ ఆఫ్ బరోడా ....అప్పీలుదారు

వర్సెస్

సాయి లక్ష్మి మెడికల్ ఏజెన్సీస్ మరియు ఇతరులు... ప్రతివాది.

దిగువ వారికి,

1. సాయి లక్ష్మి మెడికల్ ఏజెన్సీస్, 1 షాప్ నం.2, IDSMT కాంప్లెక్స్, [illegible] మహబూబ్‌నగర్-509001, [illegible] C/o [illegible], 6-2-648, [illegible] హైదరాబాద్-500004.
2. [illegible] వయస్సు సుమారు 29 సం., వృత్తి: బ్యాంక్ ఉద్యోగి, నివాసం: ఇం.నం.2-123/2, SBI పక్కన, పాత బస్టాండ్ దగ్గర మహబూబ్‌నగర్-509001.

.......ప్రతివాదులు

సమన్లు

1. Ld. ప్రిసైడింగ్ ఆఫీసర్, DRT-1, హైదరాబాద్ [illegible] 12.08.2025న ఉ.10.30 గం.లకు [illegible]
2. [illegible]
3. [illegible]
4. [illegible]

[illegible] 15 జూలై, 2025న [illegible]

సం/-

రిజిస్ట్రార్, డెట్స్ రికవరీ అప్పిల్లేట్ ట్రిబ్యునల్, కోల్‌కతా